

# మరలు, మమతలు

ఎ. శ్రీధర్

అది ఒకానొక పేరు మోసిన ప్రైవేటు కంపెనీలోని 'టూల్ రూమ్'.

ఆధునిక పద్ధతిలో డిజైన్ చెయ్యబడి అందంగా, నీట్‌గా ఉంది. లేత్, మిల్లింగ్, ప్లేనర్, షేపర్, బోరింగ్, గ్రైండింగ్, డ్రిల్లింగ్ లాంటి బేసిక్ మెషీన్లతోపాటు, మరికొన్ని ప్రత్యేకమైన పనులు చేసే ప్రత్యేకమైన మెషీన్లు కూడా కలిగి, సాంకేతిక విద్యార్థులకీ, ఇంజినీర్లకీ కనుల పండుగ చేసేలా ఉంది.

ఆ యంత్రాగారం 'ఫుల్ స్వింగ్'తో పని చేసేటప్పుడు చూడాలి. యంత్రాల మీదుగా అమర్చబడిన 'పుల్లీలు' గిరగిరా కళ్లు చెదిరిపోయేలా తిరుగుతూ, తమని బెల్టులతో బిగించిన యంత్రాలలో కొన్నిటిని, తమలాగే గిరగిరా తిప్పుతూ, మరి కొన్నిటిని క్రిందికీ మీదికీ, ముందుకీ వెనకకీ ఊగేలా చేస్తూ, రకరకాల కదలికలని వేటిని వాటికి అనుగుణంగా మార్చి ప్రదర్శిస్తూ ఉంటాయి. ఒక్కో చోట నిప్పురవ్వలు పుట్టించే గ్రైండర్లు, తమకీ కట్టర్‌కీ మధ్య చుట్టలు చుట్టలుగా పాముల లాగ సాగిపోయే లోహపు రజనును సృష్టించే 'లేత్'లు, దళసరి ఇనప ప్లేట్లని ఒకే ఒక బ్రహ్మాండమైన శబ్దంతో ముక్కలు, ముక్కలు చేసే 'షీట్ కటింగ్' యంత్రాలతోపాటు, నున్నని ఫినిష్ ఇచ్చి, నిశితమైన గ్రూవ్‌లూ, స్లాట్‌లూ తయారు చేసే 'మిల్లర్'లూ, ఒకే తడవకి రెండు నుండి ఎనిమిది వరకూ కన్నాలు పొడిచే డ్రిల్లర్‌లూ— వేటి పని అవి చేస్తూ చూసేవారిని కట్టి పడేస్తాయి.

అందులో ఆ రోజు జూన్ పదిహేడవ తారీఖు.

రెండు రోజుల క్రిందట కొత్తగా ఛార్జి తీసుకొన్న సాంకేతిక విభాగానికి చెందిన డైరెక్టర్ మొట్టమొదటిసారిగా టూల్‌రూమ్‌ని చూడడానికి వస్తున్నాడు. కొత్త డైరెక్టర్‌ని గురించి అప్పుడే చాలా రకాల ఊహాగానాలు 'స్టాఫ్'లో మొదలయ్యాయి. ఇదివరకు ఆ స్థానంలో ఉన్న దొర అకస్మాత్తుగా 'రిటైర్‌మెంట్' కోరటంవల్ల, కొత్త డైరెక్టర్ కోసం ప్రకటనలు పడి, ఇతనిని నియమించడం జరిగిందట. ఇంతవరకూ ఆ కంపెనీకి సంబంధించిన డైరెక్టర్లందరూ విదేశస్థులే కావడం, ఈ విధంగా అనుకోని మార్పు జరిగి ఒక భారతీయుడు ఆ స్థానంలో నియమించబడడం అపూర్వమైన విషయంగా మారి, చర్చలలోకి జారుకొంది. కొత్త డైరెక్టర్‌కి 'ఫారిన్ డిగ్రీ' ఉందనీ, అతను దక్షిణ ప్రాంతానికి చెందినవాడనీ మాత్రమే ప్రతి ఒక్కరికీ నికరంగా తెలిసిన విషయం. ఆపైన మిగిలినవన్నీ ఊహాలతో పూర్తి చేసి ఇంచుమించు తాము అతని చూసినట్లే మాట్లాడుతున్నారు కొంత మంది కోతల రాయుళ్లు.

వీళ్లందరినీ పేరు పేరునా తరిమి, ఎవళ్ల మిషన్ దగ్గరికి వాళ్లని నిలబెట్టే సరికి బలరామ్ మేస్త్రీకి తల ప్రాణం తోకకి వచ్చింది. ఆ మెషీన్‌షాపు ప్రొడక్షన్‌కి క్రింది స్థాయిలో బాధ్యత వహించే మేస్త్రీ పదవి ఖాళీ కావడం, అందులో తాత్కాలికంగా అందరిలోకీ సీనియర్ అయిన బలరామ్‌ని నియమించి ఎక్కువ రోజులు కాకపోవడం వల్ల, అతనంటే 'మేస్త్రీ' అనే గుర్తింపు వాళ్లలో కలగక పోవడం చూసి బలరామ్‌కి చిరాకెత్తుకొచ్చింది.

బలరామ్ పైన ఎంత కోపం ఉన్నా, డైరెక్టర్ వచ్చే రోజు కాబట్టి, అతని మీద శతకం చదువుతూ ఎవరి పని

# మరల్లో మమతలు

( 35 వ పేజీ తరువాయి)

ప్రతి మంగళవారంనాడు ఆ ఫాక్టరీ చూడడానికి బయటినుండి వచ్చే 'విజిటర్స్'ని లోపలికి రానిస్తారు. ఆ ఫాక్టరీ పేరు మోసినది కావడం వల్ల, మంచి మెషినరీ కలిగి ఉండటంవల్ల ఎక్కువగా ఇంజినీరింగ్ విద్యార్థులు దానిని చూడడానికి రావడం కద్దు. ఇతనుకూడా అలాంటి బాపతే అయి ఉండాలి! కాని, పాపం, ఇలాంటి వాతావరణంలో ఏం చూడగలడు!

"మెషిన్ కేమయింది! గేర్‌బాక్స్ ఎందుకు తెరిచారు?" ప్రశ్నించాడు అతను.

ఇతనికి కొద్దో, గొప్పో మెషిన్ల సంగతి తెలునులా ఉంది. రఘునాథ్ ఉత్సాహంతో జవాబిచ్చాడు. "ఏమీ కాలేదు. మెషిన్ ఎలాగూ రెస్ట్‌లో ఉంది కాబట్టి, ఇదే మంచి సమయం అని గేర్‌బాక్స్ తెరిచి క్లీన్ చేస్తున్నాను. అంతే!"

ఆ వ్యక్తి గేర్‌బాక్స్ దగ్గరగా వచ్చి, లోపలికి తొంగి చూస్తూ అడిగాడు: "మీ కీ విషయంలో అంత శ్రద్ధ దేనికి! అందరిలాగ కాంటీన్‌కి వెళ్ళి కూర్చోక ఈ పని ఎందుకు తలపెట్టారు?"

అతని చొరవ రఘునాథ్‌కి ఆశ్చర్యాన్ని కలగజేసింది. ఒక విజిటర్ నుండి అలాంటి ప్రశ్న నిజానికి ఆశ్చర్యకరమైన విషయమే! ఇతనెవరో స్టూడెంటు మాత్రం కాదు, ఇంజినీర్ అయి ఉంటాడు. ఇంజినీరే అయినా ఈ విషయం తెలుసుకోవడం పట్ల ఆసక్తి ఎందుకో రఘునాథ్‌కి అంతు పట్టలేదు.

"జవాబు చెప్పారు కాదేం?" అతను రెట్టించాడు.

రఘునాథ్ ఆ వ్యక్తి ముఖంలోకి వింతగా చూస్తూ జవాబిచ్చాడు. "ఈ యంత్రానికీ, నాకూ మధ్య మాటలలో చెప్పలేని అనుబంధం ఉంది. దీనివల్లనే నేను ప్రథమ శ్రేణికి చెందిన మెషినిస్టు నయ్యాను. అయినా ఒక ఇంజినీర్‌గా మీ రీ ప్రశ్న అడగటం బాగా లేదు. చేసే పనిపట్ల శ్రద్ధ వహించడం, దానికి సర్వవిధాల సహాయపడి, నమ్మిన బంటులా మన మాట వినే ఈ 'మర'ల మీద మమత పెంచుకోవడం తప్పంటారా?"

"అబ్బే . . . లేదు! అలాగని ఎవరన్నారు?" చేతి వాచీ వంక చూస్తూ అన్న ఆ వ్యక్తి మాటలు తడబడ్డాయి. సరిగ్గా అదే సమయంలో ఆ యంత్రాగారంలోని లైట్లు గుప్పుమని వెలిగాయి. ఆ వెంటనే కీచుకీచుమంటూ తిరిగిన పుల్లీలు మరికొంతసేపటికి పూర్తి వేగాన్ని పుంజుకొన్నాయి. కరెంటు వచ్చిందన్న వార్తకూడా దానిలాగే



దీపారాధన

చిత్రం— ఎస్. జి. నరసింహారెడ్డి

వ్యాపించటంతో, స్టాఫ్ అంతా ఒక్కసారి ద్వారం ముందు గుంపులు గుంపులుగా చేరి ఒకరి నొకరు తోసుకుంటూ లోపలికిరావడం మొదలుపెట్టారు. దానితో చిన్న కోలాహలం ఏర్పడి, బలరావ్ కేకలు, అదిలింపులతో మరి కాసేపటికి చల్లబడింది.

ఆ సందడిలో విజిటర్ ఎక్కడికి పోయాడో రఘునాథ్ గమనించలేదు. గేర్‌బాక్స్ కవరు ఎప్పటిలా అమర్చి మెషిన్ స్టార్ట్ చేయడంలో నిమగ్న మయ్యాడు.

ఇంతలో డైరెక్టర్‌గారు వస్తున్నారన్న వార్త వచ్చి చేరడంతో బలరావ్ మనసులోనే భగవంతునికి ధన్యవాదా లర్పించుకొని, హడావుడిగా తిరుగుతూ ఆ వార్తని అందరికీ చేరవేశాడు. అందరూ ఉత్సాహంతో ఒక కంటిని ద్వారం వంక నిలిపి, మరొక కంట మెషిన్ లోని జాబ్‌పట్ల కేంద్రీకరించారు. అలా మరికొంతసేపటికి ఆ టూల్‌రూమ్ తిరిగి తన రూపాన్ని సరిదిద్దుకొని, చూసేవారి కళ్ళు మిరుమిట్లు గొలిపేలా తయారయి డైరెక్టర్‌గారి రాకకి ఎదురు చూడసాగింది.

అనుకొన్నట్లుగానే అయిదారుగురు ఆఫీసర్ల గుంపు 'టూల్‌రూమ్'లో ప్రవేశించింది. వాళ్ళలో డైరెక్టర్‌గారి కోసం గాలించిన స్టాఫ్ ఏమీ అర్థంకాక ఒకరి ముఖం వంక మరొకరు ప్రశ్నార్థకంగా చూసుకొన్నారు. బలరావ్‌కికూడా అందులో డైరెక్టర్ ఎవరో అంతు పట్టకపోయినా, అందులో తనకి తెలిసిన 'ఫోర్‌మన్' వెనక చేతులు కట్టుకొని అనుసరించాడు. ఆ ఫోర్‌మనే మిగిలిన వారికి టూల్‌రూమ్‌లోని మెషిన్ల వంక చూపిస్తూ ఏవేవో చెపుతున్నాడు.

అలా వచ్చిన గుంపులో ఫుల్‌సూట్‌లో ఉన్న ఒక దొర ఉండటం అందరి ఆశ్చర్యానికీ కారణమయింది. ఈసారి కూడా ఒక దొరనే డైరెక్టర్‌గా నియమించి ఉంటారనీ, తమకి అందిన సమాచారం తప్పయి ఉంటుందన్న తలంపు కలిగి, నిరుత్సాహం ఆవరించింది అందరినీ.

రఘునాథ్‌కూడా అటువంటి నిస్పృహకే లోనయ్యాడు. తరవాత ఎవరైతే ఏం లే అన్న సర్దుబాటుకి వచ్చి 'జాబ్' వంక దృష్టి మరల్చాడు. అతి వేగంగా తిరుగుతున్న 'కట్టర్' 'జాబ్'ని సమీపించి నిప్పురవ్వలు కురిపించింది. కట్టర్ మంచిది కానందుకు మనసులో గొణుగుకుంటూ, స్పీడ్ తగ్గిస్తే పని సానుకూలపడవచ్చునన్న ఉద్దేశ్యంతో, క్లచ్‌హేండిల్ మీదికి చెయ్యి పోనిచ్చి, అప్రయత్నంగా గేర్ మార్చాడు.

'కట—కట'మనే బ్రేకింగ్ సౌండ్‌తో మెషీన్ ఒక్కసారిగా ఆగిపోయి అందరి దృష్టినీ ఆకర్షించింది. ముందుగా మెషీన్‌ను ఆపుచేసి, 'క్లచ్' మార్చడం జరగనందుకు రఘునాథ్ నొచ్చుకొన్నాడు. అలాంటి పరిస్థితిని మొట్టమొదటిసారిగా ఎదుర్కొనడం అతనిని స్తంభించి వేసింది.

యంత్రం వేగంలో హెచ్చు తగ్గులు చేసేముందు సాధారణంగా దానిని ఆపి, గేర్ మార్చటం చెయ్యాలి. ఒక్కొక్కప్పుడు అలాంటి పొరపాట్లు జరగగలవనే ఊహతో కొన్ని సున్నితమైన మెషిన్లకి ఒక 'ఆటోమాటిక్ కంట్రోల్' ఏర్పాటు చేసి, అలాంటి పరిస్థితి ఏర్పడినప్పుడు దానిద్వారా మెషీన్‌ని ఆపు చేయటం జరుగుతుంది.

ఇప్పుడుకూడా అలాంటి పొరపాటే జరిగింది. ఆటోమాటిక్ సాధనం ద్వారా మెషిన్ ఆగిపోయినా 'బ్రేకింగ్ నాయిస్' మాత్రం అనివార్యమవడంతో రఘునాథ్ గుండెలు ఝల్లుమన్నాయి. ఏమీ జరగలేదనీ, తిరిగి మెషిన్ స్టార్ట్ చేసి పని చేయవచ్చుననీ తెలిసినా అతని అంతరాత్మ మాత్రం దానికి ఒప్పుకోలేదు. చకచకా 'బోల్టులు' వదులు చేస, గేర్‌బాక్స్ కవరు తెరిచి ఏం జరిగిందోనని అందులోకి తొంగిచూశాడు రఘునాథ్. అన్నీ యథాస్థితిలో ఉండటం చూసిన తరవాత మనసు కుదుటపడి, తిరిగి కవర్‌ని తగిలించి పనిలో నిమగ్నమయ్యాడు.

అతని చర్య దూరంనుండే గమనించిన బలరావ్, సాటి మెషినిస్టులు లోలోపల హేళనగా నవ్వుకొన్నారు. ఏదో ఒక 'నాయిస్' ఏర్పడినంత మాత్రాన అంతలా గాభరా పడిపోవడం ఎవరికీ నచ్చలేదు. అలాంటి పొరపాట్లు సర్వసాధారణమనీ, అన్నిటికీ ఇలా బెంబేలుపడిపోతే పని నడిపించటం కష్టమనీ వాళ్ళ అభిప్రాయం. ఆ మాట ఒక విధంగా నిజమే అయినా ఆ మెషిన్ పట్ల రఘునాథ్‌కి గల మమకారం వాళ్ళ కెలా అర్థం అవుతుంది!

● ● ●

లంచ్‌టైమ్ తరవాత రఘునాథరావుని తన గదిలోకి పిలిపించి, జరిగిన పనికి సన్నగా చివాట్లు పెట్టాడు ఫోర్‌మన్. ఆ శబ్దాన్ని పట్టించుకోకుండా తన పని తను చేసి ఉంటే బాగుండిపోయేదనీ, అలా కాకుండా గేర్‌బాక్స్ కవరు తెరిచి చూడడం, తిరిగి మూత వేయడం డైరెక్టర్ దృష్టిని ఆకర్షించిందనీ, జరిగిన దానిని గురించి తను క్లుప్తంగా అతనికి తెలియజేసినా, అతను దానికి సంజాయిషీ పార్టీ ముఖతః కావాలని కూర్చున్నాడనీ చెప్పాడు. రెండు గంటల సమయంలో వెళ్ళి డైరెక్టర్‌ని అతని ఆఫీసులో కలుసుకొని క్షమాపణ చెప్పుకొని బయటపడమని చెప్పాడు.

తన వల్ల జరిగిన తప్పేమీ లేకపోయినా డైరెక్టర్ కోరికమీద రెండు

# మార్గదర్శులు

59



## 300 మైళ్ళకు మించిన వేగంతో మోటారుబండి నడిపిన మొదటి మనిషి

మూడు వందల మైళ్ళకు మించిన వేగంతో మోటారు బండి నడిపిన మొదటి మనిషి బ్రిటిష్ జగజెట్టి సర్ మాల్కొమ్ కాంప్ బెల్. అతడు వేగంలో ఈ ప్రమాణాన్ని 1935 సెప్టెంబరు 3 వ తేదిని నెలకొల్పాడు. అప్పు డాతని వయసు 50 సంవత్సరాలు.

అంతకు కొంచెం దాపులకు ముందు కాంప్ బెల్ ఫ్లొరిడాలోని డేటోనా బీచ్‌లో ఈ సందర్భంలో ఒక ప్రయత్నం చేశాడు. బీచ్ పరిస్థితి ప్రమాదకరంగా ఉన్న కారణం చేత 276.8 మైళ్ళ వేగం మాత్రమే సాధించగలిగాడు. ఆ తరవాతి ప్రయత్నం ఉటాలోని బోనెవిల్ సాల్ట్ ఫ్లాట్స్‌లో చేశాడు. అక్కడి స్థితి చాలా మెరుగుగా ఉంది. ప్రమాణం సాధించే ప్రయత్నానికి నిర్ణీతమైన మైలు దూరానికి నాలుగు మైళ్ళలో రైలుమార్గం అడ్డుగా ఉంది. 2,000 హార్స్ పవర్ కలిగిన కారు 'బ్లూ బర్డ్'ను కాంప్‌బెల్ ఆ నాలుగు మైళ్ళలో నిలుపుచేయగలడా అన్న అనుమానం తల ఎత్తింది. లేకపోతే ఆ రైలుకట్టను కారు ఢీకొంటుంది. ప్రత్యేకమైన 'విండ్ బ్రేకు'లను కారుకు అమర్చారు. మహా శక్తివంతమైన ఇంజను కల ఆ కారును రైలు కట్టకు సురక్షితమైన దూరంలో నిలుపు చేయగలిగాడు కాంప్‌బెల్.

రెండు పర్యాయాలు నిర్ణీతమైన ఆ మైలు దూరాన్ని సగటున 301. 129 మైళ్ళ వేగంతో అధిగమించాడు కాంప్‌బెల్. అతడు నేలమీద వేగంలో ప్రపంచ ప్రమాణాన్ని అధిగమించడం అది పదమూడవ పర్యాయం.

గంటలకి అతని ఆఫీసు చేరుకొన్నాడు రఘునాథ్. ఆఫీసు గుమ్మం ముందు తచ్చాడుతూ ఏ సంజాయిషీ ఇవ్వాలో తర్జన భర్జనలు చేస్తున్న రఘునాథ్ "కమిన్" అన్న పిలుపుతో లోపలికి వెళ్ళాడు.

విశాలమైన టేబిల్‌కి ఎదురుగా ఉన్న కుషన్‌సీటుకి బదులుగా ఆ 'దొర' దాని కుడివైపు ఉన్న కుర్చీలో కూర్చుని ఏవో కాగితాలు తిరగేస్తున్నాడు. రఘునాథ్ నమస్కారాన్ని అందుకొని, తాను డైరక్టర్ కాదనీ, అతను బాత్‌రూమ్‌లో ఉన్నాడనీ చెప్పాడు.

అంతలో బాత్‌రూమ్ తలుపు తెరుచుకొని లోపలికి అడుగు పెట్టిన డైరెక్టర్‌ని చూసి అవాక్కయిపోయాడు రఘునాథ్. తను విజిటర్ అనీ, ఇంటర్వ్యూ అనీ అనుకొన్న వ్యక్తి ఈ కంపెనీ సాంకేతిక విభాగానికి చెందిన డైరెక్టరా! కాని, ఇత నా గుంపుతోకాక వేరుగా ఎందుకు వచ్చినట్లు? కరెంటు తిరిగి వచ్చిన తరవాత జరిగిన గొడవలో తను ఇత నెక్కడికి పోయాడో గమనించలేదు. తనతో స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడాడితను. అంటే తెలుగువాడే నన్న మాట!

"కూర్చోండి." కుర్చీ వైపు చూపిస్తూ అన్న అతని మాటలు రఘునాథరావు ఆలోచనలకి పగ్గం పట్టాయి. కూర్చోకుండానే అడిగాడు—"నన్ను పిలిపించారట!" అని.

"అవును! జరిగిన దానికి సంజాయిషీ అడగటానికి మాత్రం కాదు."

"మరి. . ." మెల్లగా గొణిగాడు రఘునాథ్.

"ఇతను నా బెస్ట్ ఫ్రెండ్! స్టేట్స్‌లో ఉండేటప్పుడు పరిచయం జరిగింది. స్టేట్స్‌లో ఉన్న ఇతని కంపెనీకి, మన కంపెనీకి మధ్య కొన్ని 'ఎస్సైన్‌మెంట్స్' ఉండటం వల్ల ఇక్కడికి వచ్చారు. ఇద్దరం ఒకేసారి రావడం ఘటన క్రిందనే చెప్పుకోవాలి." పక్క కుర్చీలో కూర్చున్న దొరని పరిచయం చేస్తూ మాట్లాడాడతను. "ఇతని సలహామీదనే నేను టూల్‌రూమ్‌కి వచ్చే ముందు 'నాన్—ఫ్లయింగ్ వెదర్'ని సృష్టించాను. దానితో మెషీన్‌షాపు ఖాళీగా స్వాగతం పలికి నిజానిజాలు తెలుసుకోదగ్గ అవకాశాన్ని కలిగించింది. . ."

రఘునాథ్ కుతూహలంతో అతని ముఖం వంక చూశాడు. 'తన జీవిత కాలంలో ఇలాంటి ఆఫీసర్‌ని చూడటం ఇదే మొదటిసారి' అని అనుకోకుండా ఉండలేకపోయాడు.

"జీవం లేని యంత్రాన్ని కూడా మనుషులతో సమానంగా ప్రేమించడం మీ దగ్గరే చూశాను. కరెంటు వచ్చిన తరవాత జరిగిన సంఘటన కూడా దానినే బుజువు చేసింది."

రఘునాథ్ నోట మాట రాలేదు. ఆఫీసర్‌నుండి ఇలాంటి మాటలు వినవలసి వస్తుందని అతను ఊహించలేకపోయాడు. తనని గురించిన పొగడ్త అతనికి భరించరానిదై తోచి తల క్రిందికి దించేసుకొన్నాడు.

"ఆఫీసుకి రాగానే మీ 'రికార్డ్' తెప్పించి చూశాను. మీరు మేస్త్రీ పోస్టుకి చేసిన అప్లికేషన్ కనిపించింది. ఇకమీదటనుంచి మీ ప్రేమని ఒక్క మిల్లింగ్-మెషీన్‌కే పరిమితం చేయకుండా టూల్‌రూమ్‌లోని ప్రతి మెషీన్‌కీ చెందేలా వ్యాప్తి చేయండి . . ."

డైరెక్టర్ మాటల సారాంశాన్ని గ్రహించిన రఘునాథ్ సంతోషానికి మేర లేకపోయింది. అవ్యక్తమైన కృతజ్ఞతని చేతుల జోడింపుతో తెలియజేసి, అడుగులు తడబడగా ఆఫీసు బయట పడ్డాడతను.

మెట్లు దిగుతూండగా రకరకాల ఆలోచనలు రఘునాథ్‌ని చుట్టుముట్టాయి. అన్నిటికన్నా ముఖ్యంగా 'ప్రేమ' అనే పదం సాంకేతిక పదజాలంలో కూడా చోటు చేసుకోవడం అతనిని విస్మయంలో ముంచెత్తింది. ★